అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా
- ప్రజావాణిలో అర్జీలు స్వీకరణ

ఆదిలాబాద్: ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం,జూలై 22 : ప్రజావాణిలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కారమయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజార్షిషా సూచించారు. సోమవారం ఆదిలాబాద్‌లోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ పాల్గొని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో 103 దరఖాస్తులు వచ్చాయని, పింఛన్, స్కూల్ అడ్మిషన్, ఆశకార్యకర్తలు తమ సమస్యలు పరిష్కరించాలని, సంజయ్‌నగర్ నుంచి బట్టి సావర్గాంకు రోడ్డు వేయాలని, తదితర ఆయా శాఖలకు సంబంధించిన దరఖాస్తులు అధికారులకు ఇస్తూ తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వీయ, ఆర్డీవోలు వినోద్ కుమార్, జివాకర్ రెడ్డి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించవద్దు

నిర్మల్ అర్బన్, జూలై 22 : సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆమె పాల్గొని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్, ధరణి, భూసమస్యలు, డబుల్ బెడ్రూం ఇండ్లు తదితర సమస్యలపై వినతులు అందించారు. ప్రజల సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఉట్నూర్, జూలై 22: గిరిజనుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా అన్నారు. ఉట్నూర్ పీవో క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆమె పాల్గొని అర్జీలను స్వీకరించారు. అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అర్జీలను పరిశీలించి సంబంధిత శాఖలకు బదిలీ చేశారు. ఈ దర్బార్‌లో డీడీ దిలీప్ కుమార్, ఏపీవో కనక భీంరావ్, డీఎం జీసీసీ రామనందన్, జిల్లా అదనపు వైద్యాధికారి మనోహర్, ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, గిరిజనులు పాల్గొన్నారు.

నిర్మల్‌అర్బన్: అర్జీ దారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

ఉట్నూర్: అర్జీదారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా

దివ్యాంగులకు స్మితా సబర్వాల్ క్షమాపణ చెప్పాలి

మాట్లాడుతున్న దివ్యాంగుల నిరుద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ సలీం

ఎదులాపురం, జూలై 22 : సివిల్ సర్వీస్ ఉద్యోగాల్లో దివ్యాంగుల కోటా ఉండొద్దన్న సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ చేసిన వ్యాఖ్యాలను ఖండిస్తున్నామని వెంటనే దివ్యాంగులకు ఆమె క్షమాపణ చెప్పాలని దివ్యాంగుల నిరుద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ సలీం డిమాండ్ చేశారు. సోమవారం ఆదిలాబాద్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగుల మనోభావాలను దెబ్బతీయడం సరికాదన్నారు. పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి సురేశ్, కోఆర్డినేటర్ ప్రమోద్‌కుమార్, ఆర్గనైజర్ బంక రాజశేఖర్, దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బావునే నగేశ్ పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలి

జైనథ్, జూలై 22 : రైతు రుణమాఫీ పంపిణీలో తమకు న్యాయం చేయాలని రైతులు సోమవారం జైనథ్ తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ శ్యాం సుందర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ అందిస్తున్నామని చెప్పి కోత విధించడం పట్ల అసహనానికి గురవుతున్నారన్నారు. రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి ప్రభుత్వం కనీసం రూ.లక్ష రుణమాఫీ చేయకపోవడంతో రైతులపై చిత్తశుద్ధి లేకుండా వ్యవహరిస్తోందన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు అశోక్, గణేశ్, సంతోష్, దేవన్న, రమేశ్, శివన్న, జీవన్, ఆశన్న పాల్గొన్నారు.

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ


పరామర్శిస్తున్న మాజీమంత్రి జోగు రామన్న

ఎదులాపురం, జూలై 22: బట్టిసావర్గాంకు చెందిన జక్కుల పెద్ద రాజన్న బీఆర్‌ఎస్ కార్యకర్త శ్రీకాంత్, లసుంబాయి ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను సోమవారం మాజీ మంత్రి జోగు రామన్న పరామర్శించారు. అలాగే బీఆర్‌ఎస్ కార్యకర్త శ్రీకాంత్ కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ గోవర్ధన్, సతీశ్, మాజీ ఎంపీపీలు రాజన్న, సేవ్వా జగదీశ్, నవీన్ దత్తు సురేశ్, చందు ఉన్నారు.

లక్ష్మణచాంద, జూలై 22: ఇటీవల కురిసిన భారీ వర్షానికి మండల కేంద్రానికి చెందిన కుంటాల రాజవ్వ ఇల్లు కూలి పోయింది. సోమవారం మాజీ జడ్పీటీసీ ఓస రాజేశ్వర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తనవంతు సహాయంగా రూ. 2వేలు కుంటాల రాజవ్వకు అందజేశారు. ప్రభుత్వ పరంగా సహాయం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట నాయకులు శ్రీనివాస్, అట్ల రాంరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నగేశ్, రజినీకాంత్, రవి, సిర్ర లింగన్న, మహిపాల్, ఎంపీవో నసీరొద్దీన్ ఉన్నారు.

స్టీరింగ్ కమిటీ ఎన్నిక

నిర్మల్ అర్బన్, జూలై 22 : నిర్మల్ జిల్లా కేంద్రానికి సంబంధించి ప్రెస్‌క్లబ్ నిర్వహణ కోసం స్టీరింగ్ కమిటీని సభ్యులు ఎన్నుకున్నారు. ఇందులో రాంపెల్లి నరేందర్, అనుముల శివకుమార్, శ్రీనివాసాచారి, సజ్జనపు ప్రకాశ్, వసీం, ముఖీమ్, సల్మాన్, అల్లం అశోక్, బాస లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, పూసాల పోశెట్టి, సాయన్న, సాయేందర్, శశికుమార్, లక్ష్మణ్‌ను స్టీరింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. సమావేశంలో ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

PASSPORT MISSING
I, DHORA NAVEEN GOUD S/o. LAXMA GOUD, R/o. H.No.1-12, Vill:Pipri, R/m Lokeshwaram, Dist: Nirmal, Telangana I lost my Passport bearing No. Y3821349 while Travelling Bike from Pipri to Nirmal on 03-07-2024 if any body found contact:
Cell: 9618338118

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

పునరావాస గ్రామాలకు మెరుగైన సౌకర్యాలు

నిర్మల్ చైన్‌గేట్, జూలై 22: కడెం మండలం కొత్త మద్దిపడగ గ్రామంలో పునరావాసితులైన మైసంపేట్, రాంపూర్ గ్రామాల ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయా శాఖల అధికారులు, గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పునరావాస గ్రామస్తులకు నష్టపరిహారం కింద ఇచ్చిన భూములను రక్షించుకోవాలని, భూములను అమ్మడం తనఖా పెట్టడం చెల్లదని తెలిపారు. భూముల చదును చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఈ వర్షాకాలం నుంచే వ్యవసాయం సాగు మొదలు పెట్టాలని అన్నారు. బ్యాంకు రుణాలకు సంబంధించి బ్యాంకర్లతో మాట్లాడి రుణాలు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అధికారులంతా పునరావాస ప్రజలకు తోడ్పాటునందించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు కిశోర్‌కుమార్, అటవీ అధికారి ప్రసాద్, ఆర్డీవో రత్నకళ్యాణి, జడ్పీ సీఈవో గోవింద్, డీపీవో శ్రీనివాస్, డీఆర్డీవో విజయలక్ష్మి, డీఈవో రవీందర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో ధన్‌రాజ్, డీడబ్ల్యూవో నాగమణి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

ఇచ్చోడ, జూలై 22 : మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ షేక్ మోసిన్ అంత్యక్రియల్లో సోమవారం ఎమ్మెల్యే జాదవ్ అనిల్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన ఎమ్మెల్యే అభిమాని అబ్దుల్ సాబీర్ బామ్మర్ది గౌస్ పాషా ఇటీవల మృతి చెందాడు. ఎమ్మెల్యే వారి స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ ప్రీతమ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు ఉన్నారు.

తహసీల్దార్‌కు వినతి

లోకేశ్వరం, జూలై 22: బీసీ డిక్లరేషన్లు అమలు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ మోతీరాంకు వినతి పత్రం ఇచ్చారు. ఇక్కడ ఓబీసీ బీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దగిడే భోజన్న, శ్రీనాథ్, వంశీగౌడ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సోన్, జూలై 22: హైవే రోడ్డుకు దగ్గర ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కొత్త వ్యక్తులు గ్రామాల్లోకి వస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి అన్నారు. సోమవారం సోన్ మండలం సాకెర గ్రామంలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఎస్పీ హాజరై మాట్లాడారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా పెట్టుకోవాలని, రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనం నడుపాలన్నారు.అదే విధంగా 56బైక్‌లు, మూడు ఆటోలు, ఒక ట్రాక్టర్‌ను తనిఖీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సోన్ సీఐ నవీన్‌కుమార్, ఎస్ఐ గోపి, మామడ, లక్ష్మణచాంద ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల బదిలీలు

బోథ్, జూలై 22 : మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న వివిధ కార్యదర్శులు బదిలీ అయ్యారు. దేవుల్‌నాయక్ తండాలో పని చేస్తున్న బీ రాకేశ్ గుడిహత్నూర్ మండలం మన్నూర్‌కు, చింతగూడలో పని చేస్తున్న జీ రవీందర్ జైనథ్ మండలం లక్ష్మిపూర్‌కు, సాకేరలో పని చేస్తున్న కే రవీందర్, కంటెగామ్‌లో పని చేస్తున్న ఎం చార్లెస్ జైనథ్ మండలం మాకోడకు, అందూర్‌లో పని చేస్తున్న షకిల్ అహ్మద్ కౌఠ(బీ)కి, ఘన్‌పూర్‌లో పని చేస్తున్న మోహమ్మద్, తైవిద్ ఇచ్చోడ మండలం ధరంపూర్‌కు, చింతలబోరిలో పని చేస్తున్న సీహెచ్ శ్రీకాంత్ పార్డి(కే)కు, గుర్రాలతండాలో పని చేస్తున్న శివకుమార్ నేరడిగొండ మండలం గుత్పాలకు, సోనాలలో పని చేస్తున్న స్వామి నేరడిగొండ మండలం తర్నంకు బదిలీ అయ్యారు. వీరితోపాటు గ్రేడ్-3 పంచాయతీ కార్యదర్శిగా రాజేశ్వర్, నరేశ్, చారి, ప్రసాద్ గౌడ్, తిరుమల్ జిల్లాకు బదిలీ అయ్యారు. కౌఠ(బీ)లో పని చేస్తున్న అంజయ్య బోథ్‌కు బదిలీ అయ్యారు.

కడెంకు కొనసాగుతున్న వరద

కడెం, జూలై 22 : నిర్మల్ జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా కడెం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు (7.603టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 691.200 అడుగులు (5.502టీఎంసీల) వద్ద ఉంది. అయితే సోమవారం ఎగువ ప్రాంతాల నుంచి 6311 క్యూసెక్కుల వరద రావడంతో అధికారులు ఒక్క గేటును ఎత్తి దిగువకు 3 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అలాగే కుడి కాలువ ద్వారా 8 క్యూసెక్కులు, ప్రధాన కాలువ కాలువ ద్వారా 298 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

ఖానాపూర్, జూలై 22 : ఖానాపూర్ మున్సిపాలిటీలో ప్రజలకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చైర్మన్ రాజురా చిన్నం సత్యం పేర్కొన్నారు. సోమవారం మున్సిపాలిటీలోని 12 వార్డుల్లో తాగునీటి ఎద్దడి లేకుండా బోర్లు వేయడానికి స్థలాన్ని పరిశీలించారు. ఎనిమిదో వార్డులో కాలనీ వాసులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పరిష్కరించే దిశగా కృషి చేస్తామని చెప్పారు. ఆయన వెంట మాజీ వైస్ చైర్మన్ ఖలీల్, మున్సిపల్ సిబ్బంది, కాలనీ వాసులు ఉన్నారు.

తహసీల్దార్‌కు వినతి

ఖానాపూర్ టౌన్, జూలై 22: ఆగస్టు నెల నుంచి తమ గ్రామాల్లోనే రేషన్ బియ్యం పంపిణీ చేయాలని అడవి సారంగాపూర్, కొత్తగూడ, రాజుల మడుగు, జిల్లెడి కుంట గ్రామాలకు చెందిన ప్రజలు సోమవారం తహసీల్దార్ శివరాజ్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఇక్కడ మడావి లింగు, ఆత్రం భీంరావ్, తదితరులు ఉన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

సోన్, జూలై 22 : నిర్మల్ మండలం ఎల్లపెల్లి గ్రామ శివారులోని కలెక్టరేట్ కార్యాలయ ముందు గల డబుల్‌బెడ్రూం ఇంటి వెనుక ఉన్న మురుగు కాలువలో గుర్తు తెలియని మృతదేహం సోమవారం లభ్యమైందని నిర్మల్ రూరల్ ఎస్ఐ సాయికుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... 30-35 సంవత్సరాల వయస్సు గల మృతదేహం లభ్యమైంది. నల్ల పాయింట్, నీలంకలర్ చొక్కా ధరించి ఉన్నాడని ఇతని ఎవరైనా గుర్తుపట్టిన వారు నిర్మల్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

వాహనాల తనిఖీ

సోన్, జూలై 22: సోన్ మండలం గంజాల్ టోల్‌ప్లాజా వద్ద సోమవారం సాయంత్రం ఎస్ఐ గోపి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ప్రతి ఒక్కరూ ధ్రువపత్రాలతో పాటు హెల్మెట్‌ను ధరించి వాహనం నడుపాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

దిలావర్‌పూర్, జూలై 22: దిలావర్‌పూర్ బస్టాండ్ వద్ద బైక్‌ను కారు ఢీ కొట్టిన ఘటనలో సారంగాపూర్ మండలం స్వర్ణ గ్రామానికి చెందిన ఒల్లెపు సాయవ్వ (70) మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తన మనుమడు రాజు బైక్‌పై బంధువులైన నర్సాపూర్(జీ) మండలం రాంపూర్ గ్రామానికి వెళ్లి స్వగ్రామానికి వెళ్తుండగా దిలావర్‌పూర్ బస్టాండ్ వద్ద నిర్మల్ వైపు నుంచి భైంసా వైపుకు వెళ్తున్న కారు బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రాజు, సాయవ్వకు గాయాలయ్యాయి. వెంటనే వారిని నిర్మల్ దవాఖానకు తరలించినారు. చికిత్స పొందుతూ సాయవ్వ మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజేశ్వర్ గౌడ్ తెలిపారు.

గడ్‌చాందలో దొంగతనం

లోకేశ్వరం, జూలై 22: మండలంలోని గడ్‌చాంద గ్రామంలో దొంగతనం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అంబకంటి లావణ్య ఆదివారం ఇంటికి తాళం వేసి తన కుమారుడిని చూడడానికి ముథోల్‌కు వెళ్లింది. సాయంత్రం 6 గంటలకు తిరిగి ఇంటికి రాగా గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువా పగలగొట్టి 35 గ్రాముల బంగారం, నగదు రూ. 20 వేలు మొత్తం విలువ రూ. 1,50,500 లు దొంగలించిపోయారు. అంబకంటి లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ దిగంబర్ తెలిపారు.

జిల్లాలో అక్రమ డిప్యూటేషన్లు

కడెం, జూలై 22: నిర్మల్ జిల్లాలో ఉపాధ్యాయ అక్రమ డిప్యూటేషన్లు జోరుగా సాగుతున్నాయని ఎస్టీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు భూక్యా రాజేశ్‌నాయక్ అన్నారు. సోమవారం కడెంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మారుమూల గిరిజన మండలం పెంబి నుంచి ప్రైవేట్ విద్యావలంటీర్లను నియమించి దొందారి, రాంనగర్, మందపల్లి ప్రాథమిక పాఠశాలల నుంచి ఇద్దరు ఉపాధ్యాయులను దస్తురాబాద్ మండలానికి కేటాయించడం ద్వారా అక్కడ గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందకుండా పోతుందని వాపోయారు. ఈ విషయమై కలెక్టర్ స్పందించి గిరిజన గ్రామాలకు చెందిన పాఠశాలలకు న్యాయం జరిగేలా చూడాలని ఆయన కోరారు. అలాగే నియోజకవర్గంలోని ఖానాపూర్, కడెం, దస్తురాబాద్, పెంబి మండలాల్లో ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించాలని, ఈ విషయమై అనేక సార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన స్పందించడం లేదని అన్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

క్రీడా పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే

ఎదులాపురం,జూలై 22 : జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని క్రీడా పాఠశాలను ఎమ్మెల్యే పాయల్ శంకర్ సోమావారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వసతి గృహంలోని డైనింగ్ హాల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా పాఠశాలలో డిప్యూటేషన్లపై ఉపాధ్యాయులను నియమిస్తున్నారని, ఇక్కడ పూర్తి స్థాయిలో సిబ్బంది లేక విద్యా వ్యవస్థ కుంటుపడుతుందన్నారు. ఈ విషయం ప్రిన్సిపాల్ సెక్రటరీ, రాష్ట్ర క్రీడా ప్రాధికారి సంస్థ ఎండీ దృష్టికి ఇది వరకే తీసుకెళ్లి వివరించామని తెలిపారు. మరో సారి తాజా పరిస్థితులను తెలియజేస్తామని తెలిపారు.

ఆయిల్ పామ్ సాగుపై అధికారులతో సమీక్ష

ఎదులాపురం, జూలై 22 : ఆయిల్ పామ్ సాగుపై ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా వ్యవసాయ, హార్టికల్చర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం రెండు వేల ఎకరాలలో ఆయిల్ పామ్ ఏర్పాటు చేయాలన్నారు. ఇచ్చోడ, బోథ్, బజార్‌హత్నూర్, నేరడిగొండ, సిరికొండ మండలాల్లో 500 ఎకరాలలో, గుడిహత్నూర్, ఇంద్రవెల్లి, ఉట్నూర్, నార్నూర్, తలమడుగు, తాంసి, భీంపూర్ లలో 900 ఎకరాలలో, ఆదిలాబాద్, రూరల్, అర్బన్, మావల, జైనథ్, బేలలో 600 ఎకరాలలో ఈ పంటను సాగు చేసే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతులను ఎంపిక చేయాలని తెలిపారు. నెలవారీ టార్గెట్ 230 ఎకరాలలో ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందుకు వ్యవసాయ శాఖ అధికారి ఉద్యానవన శాఖ అధికారులతో కో ఆర్డినేషన్ చేసుకొని లక్ష్యాలను సాధించాలని తెలిపారు. సమావేశంలో వ్యవసాయ అధికారి పుల్లయ్య, హార్టికల్చర్ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన రైతులకు పంట రుణ మాఫీ చేయాలి

ఇంద్రవెల్లి, జూలై 22 : ఇంద్రవెల్లి ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన రైతులకు పంట రుణమాఫీ చేయాలని రైతు సంఘం జిల్లా నాయకులు సోమోరే నాగోరావ్, రామ్‌నివాస్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనేతర రైతులు సాగు చేస్తున్న భూములకు రైతు భరోసా, రైతు రుణమాఫీ, బ్యాంకు రుణాలు, పహణీలు జారీ చేసి వ్యవసాయ సంక్షేమ పథకాలు అందించాలన్నారు. అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ మాట్లాడి ఏజెన్సీలోని గిరిజనేతర రైతుల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో రైతులు ఫిరాజీ, గణేశ్, గోపినాథ్, ప్రేమ్‌సింగ్, తారాసింగ్, రతన్‌సింగ్ పాల్గొన్నారు.

రైతు బీమా దరఖాస్తుల స్వీకరణ

దిలావర్‌పూర్, జూలై 22 : మండలంలోని ఆయా గ్రామాల్లో గల కొత్త పట్టదారు పాసుపుస్తకం గల రైతులు రైతుబీమా కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి స్రవంతి తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు శ్రీవాణి, రైతులు పాల్గొన్నారు.

జలపాత సందర్శనకు అనుమతి లేదు

బజార్‌హత్నూర్, జూలై 22 : గిర్నూర్ గ్రామపంచాయతీ పరిధిలోని బలన్‌పూర్ గ్రామ సమీపంలోని కనువిందుగా కనకాయ జలపాతం అనే శీర్షికతో ప్రమాదపు అంచున చేపల వేట అనే కథనం ఆదివారం ప్రచురితం కావడంతో మండలంలోని పోలీసులు స్పందించారు. స్థానిక ఎస్సై నరేశ్ కనకాయ జలపాతం వెళ్లే రహదారి వైపు ఫ్లెక్సీ ఏర్పాటు చేసి భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జలపాతం సందర్శనకు అనుమతి లేదని సందర్శకులు గమనించాలని బోర్డును ఏర్పాటు చేశారు.

సమయపాలన పాటించాలి

తలమడుగు, జూలై 22 : మండల విద్యా శాఖాధికారులకు, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఉన్నత పాఠశాలల సమయం ఉదయం 9 నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు నిన్నటి నుంచి అమలు అయినా సందర్భంగా కలెక్టర్ సూచన మేరకు వర్షాలు అధికంగా కురుస్తున్నందున విద్యార్థుల విషయంలోను, మధ్యాహ్న భోజన విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఆశయాలను కొనసాగించాలి

చంద్రశేఖర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఖానాపూర్, జూలై 22: కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ ఆశయాలను కొనసాగించాలని సీపీఐ ఎంఎల్ (ప్రజాపంథా) ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి నంది రామయ్య కోరారు. సోమవారం ఖానాపూర్‌లోని విశ్రాంతి భవనంలో రాయల చంద్రశేఖర్ సంతాప సభను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు అంకుశ్‌రావు, రాజన్న, శంకర, లచ్చన్న, మంతు, జ్యోతిరాం పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి

ఖానాపూర్ టౌన్, జూలై 22: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన విధంగా రాష్ట్రంలో బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా మండల కమిటీ అధ్యక్షుడు పుప్పాల సునీల్ కుమార్, నాయకులు సోమవారం ఖానాపూర్‌లో తహసీల్దార్ శివరాజ్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు స్వామి, రవి, ఉపేందర్, సంతోష్, రాజశేఖర్, శ్రావణ్, సాయికిరణ్, నరేశ్, సురేశ్ పాల్గొన్నారు.

సీడీపీవోపై చర్యలు తీసుకోండి

పెంబి, జూలై 22 : అక్రమంగా డబ్బులు వసూలు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్న ఖానాపూర్ సీడీపీవో సరితపై చర్యలు తీసుకోవాలని రాంగూడ అంగన్‌వాడీ టీచర్ రాణి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్‌కు సోమవారం ఆయన నివాసంలో వినతిపత్రం ఇచ్చారు. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని వాపోయారు. తమరు స్పందించి చర్యలు తీసుకునేలా కృషి చేయాలని కోరారు.

ప్రొసీడింగ్‌కాపీ అందజేత

భైంసా, జూలై 22 : పట్టణంలోని కమల జిన్నింగ్ ఫ్యాక్టరీలో బాసరలో గల ఓం శాంతి సంస్థకు రూ. 5 లక్షల ప్రొసీడింగ్ కాపీని మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు పటేల్ సోమవారం సంస్థ సభ్యులైన బ్రహ్మకుమారీలకు అందజేశారు. ఆయన వెంట శంకర్ చంద్రే, రాంచందర్ రెడ్డి, బ్రహ్మకుమారీలు ఉన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు

కడెం, జూలై 22: మండలంలోని కన్నాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని చిన్నక్యాంపు గ్రామానికి చెందిన సంఘం మల్లేశ్ చెందిన ఇల్లు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా కూలిపోయింది. సోమవారం తనతో పాటు కుటుంబ సభ్యులు పనికి వెళ్లడంతో ఇంట్లో ఎవరు లేని సమయంలో ఇల్లు కూలిపోయినట్లు తెలిపారు..నిరుపేద కుటుంబానికి చెందిన మల్లేశ్‌ను ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

ఆధ్యాత్మిక మార్గమే ఉన్నతమైన జీవితానికి దిక్సూచి

ముథోల్, జూలై 22 : ఆధ్మాత్మిక మార్గమే ఉన్నతమైన జీవితానికి దిక్సూచి అని మహారాష్ట్రకు చెందిన ప్రముఖ ఆధ్మాత్మిక గురువు సాయి నాథ్ మహారాజ్ అన్నారు. సోమవారం ముథోల్ మండలం విటోలి గ్రామంలో ఆనంద దత్త ధామ సేవాశ్రమ స్థాపన మహోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. గురు పౌర్ణమి పురస్కరించుకొని జెండాను ఆవిష్కరించి భక్తులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. గురువు ఉపదేశంతోఏ అన్ని రకాలుగా ముందుకు వెళ్లగలుగుతామన్నారు. కార్యక్రమంలో విట్టోలి మాజీ సర్పంచ్ సత్తయ్య గౌడ్, ముథోల్ వీడీసీ అధ్యక్షుడు నారాయణ, కోశాధికారి సాయినాథ్, ముథోల్, విట్టోలి గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

బీసీలకు ఇచ్చిన హామీని నెరవేర్చాలి

భైంసా, జూలై 22 : సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీజేపీ నాయకులు సోమవారం భైంసాలోని తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రవీణ్ కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు మల్లేశ్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి కామారెడ్డి ఎన్నికల సభలో బీసీ డిక్లరేషన్ ద్వారా బీసీలకు 23 శాతం నుంచి 43 శాతానికి రిజర్వేషన్లు పెంచుతామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. ఇక్కడ నాయకులు పోశెట్టి, శ్రీనివాస్, ఉన్నారు.

పంచాయతీ కార్మికుల సేవలు అభినందనీయం

ముథోల్, జూలై 22: ముథోల్‌ను పరిశుభ్రంగా ఉంచడంలో గ్రామ పంచాయతీ కార్మికుల సేవలు అభినందనీయమని ఇన్‌చార్జి ఈవో అనూష అన్నారు. వర్షాకాలం ప్రారంభం దృష్ట్యా విధులను నిర్వహించే పంచాయతీ కార్మికులకు సోమవారం ఈవో రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

భైంసా, జూలై 22: భైంసాకు చెందిన సాయి మిషన్ భగీరథలో పని చేస్తుండగా చేయి విరిగింది. కుటుంబ సభ్యులు మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. చికిత్స నిమిత్తం రూ.లక్ష 50వేల ఎల్‌వోసీ కాపీని సోమవారం బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ బామ్మి రాజన్న, కుంటాల మాజీ జడ్పీటీసీ బుచ్చన్న, భూమేశ్, హైమద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు కుట్టుమిషన్ అందించాలి

ఎదులాపురం, జూలై 22 : గతేడాది సెప్టెంబర్‌లో మైనార్టీ శాఖా ద్వారా మంజూరైన కుట్టుమిషన్ యంత్రాలకు ఎంపిక చేసిన లబ్ధిదారులకు అందించాలని కోరుతూ బీఆర్‌ఎస్ నాయకులు సాజిదోద్దీన్ కోరారు. ఈ విషయమై సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్ సమస్యను పరిష్కరించాలని ఆ శాఖా అధికారులకు సూచనలు చేశారు.

రోడ్డు భద్రతపై ప్రయాణీకులకు అవగాహన

తలమడుగు, జూలై 22 : మండలంలోని భరంపూర్ గ్రామంలోని బస్టాప్ వద్ద సోమవారం ఆర్టీసీ సిబ్బంది ప్రయాణీకులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. . కార్యక్రమంలో సేఫ్టీవార్డెన్ జి.విష్ణు, ఏడీసీ ప్రేమ్‌సింగ్, విలేజ్ బస్సు ఆఫీసర్ సి సతీశ్, ప్రయాణికులు పాల్గొన్నారు.

తల్లీ, బిడ్డకు చేయూత ఇచ్చిన రిమ్స్ ఔట్‌పోస్టు పోలీసు


చైల్డ్‌లైన్ సిబ్బందికి తల్లీబిడ్డను అప్పగిస్తున్న ఔట్‌పోస్టు పోలీస్, సెక్యూరిటీగార్డు సిబ్బంది

ఎదులాపురం, జూలై 22 : రెండు వారాలుగా రిమ్స్‌లో తిరుగుతున్న తల్లీ కూతుళ్లను ఐసీడీఎస్ అధికారులు చేరదీశారు. వివరాలకు వెళ్లితే.. ఇంద్రవెల్లి మండలం హర్కపూర్ గ్రామానికి చెందిన మెస్రం మారుబాయి(35) ఈ నెల 9వ తేదీన రిమ్స్ ఓపీ విభాగంలో చికిత్స పొందింది. అప్పటి నుంచి మూడేళ్ల కూతురు కళ్యాణితో కలిసి అక్కడే ఉంటూ ఎవరైనా ఆహారం ఇస్తే తింటూ కాలం వెల్లదీసింది.. తనకు ఎవరూ లేరని తన కూతురిని ఎవరికైనా ఇచ్చేస్తానని ఆమె చెబుతుండడంతో రిమ్స్ ఔట్ పోస్టులో ఉన్న పోలీసు వెంకట్ రెడ్డి, సెక్యూరిటీగార్డ్ నరేశ్ చైల్డ్‌లైన్ 1098కు సమాచారం ఇచ్చారు. వారు గంటల తరబడిన రాకపోవడంతో అక్కడే ఉన్న న్యాయ సహాయ కేంద్రం ద్వారా జిల్లా బాలల సంరక్షణ సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి చిన్నారిని స్థానిక అనాథాశ్రమానికి తరలించారు. తల్లి మెస్రం మారుబాయిని తలమడుగు మండలంలోని సాయిలింగి ఆశ్రమానికి తరలించారు. అయితే ఆమె ఆరోగ్యం బాగలేకపోవడంతో మళ్లీ రిమ్స్‌కి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆరోగ్యం కుదుటపడగానే అనాథ ఆశ్రమానికి తరలిస్తామని ఈ విషయంలో డీసీపీవో రాజేంద్రప్రసాద్‌కు ఫోన్‌ద్వారా వివరణ కోరగా ఆయన స్పందించ లేదు.

మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు విడుదల చేయాలి

తలమడుగు, జూలై 22 : పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దర్శనాల మల్లేశ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో సర్వే నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు ఇప్పటి వరకు మూడు నెలల నుంచి రాష్ట్ర ప్రభుత్వం రూ.2 వేలు ఇవ్వడం లేదని, నెలకు రూ.40 వేల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో ధర్నాలు చేపడుతామని హెచ్చరించారు.

వాహనం ఢీకొని జింక మృతి

ఇచ్చోడ, జూలై 22 : మండలంలోని రాఘుగూడ గ్రామం వద్ద జాతీయ రహదారిపై సోమవారం ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ సమీపంలో జింకలు పరుగులు తీస్తూ హైవేపైకి చేరుకున్నాయి. రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొనడంతో ఒక జింక అక్కడికక్కడే మృతి చెందింది. ఫారెస్ట్ రేంజ్ అధికారి పుండలిక్ సిబ్బందితో ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.